

బావపై హత్యాయత్నం కేసులో బామ్మర్ది అరెస్ట్

బావను, చెల్లెలును హత్య చేసేందుకు ప్రయత్నించి విఫలమైన బావమరిదిని పోలీసులు అరెస్ట్ చేశారు. -IIలో..



బ్యాంక్ ఆఫ్ బరోడాలో అక్రమాలపై సీబీఐ విచారణ

బ్యాంక్ ఆఫ్ బరోడా కలికిరి బ్రాంచ్‌లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టింది. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.60	రూ.94



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 929 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	202	448
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 2002.76 కిలోలు

న్యూస్‌రీల్

ఏపీ డీఈఈ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

రాయచోటిటౌన్ : అన్నమయ్యజిల్లా వ్యాప్తంగా ఉన్న డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (ఏపీ డీఈఈ సెట్) 2023–2024 సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాయచోటి డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాఘవరెడ్డి, అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు జూన్ 5వ తేదీన హాల్ టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని వివరించారు.

గాలివానకు పండ్లతోటలు ధ్వంసం




నాగవరంలో పడిపోయిన అరటితోట

చిట్వేలి: మండలంలోని నాగవరం, సీఎం రాచపల్లి పంచాయతీలలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షంతో అరటితోటలు ధ్వంసమయ్యాయి. మామిడి కాయలు రాలిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల ఉద్యానశాఖ అధికారిణి ఆసి యా, సచివాలయం వీహెచ్‌ఏ రామాంజనేయులు పంటనష్టాన్ని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

ఐదుగురు తహసీల్దార్ల బదిలీ

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన ఇద్దరితోపాటు ఐదుగురు తహసీల్దార్లను పాలనాపరమైన మార్పుల్లో భాగంగా డిప్యూటేషన్లపై బదిలీ చేస్తూ కలెక్టర్ గిరీషా పీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. బి.కొత్తకోట తహసీల్దార్ కే.ధనుంజయలును పీలేరుకు, పెద్దమండ్యం తహసీల్దార్ కే.నిర్మలాదేవిని కలెక్టరేట్‌లోని మెజిస్టీరియల్ విభాగానికి సూపరింటెండెంట్‌గా, తహసీల్దార్ ఎస్.రఫీక్ అహ్మద్‌ను బి.కొత్తకోట తహసీల్దార్‌గా, డెప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లో పని చేస్తున్న గుర్రంకొండ తహసీల్దార్ డీసీ.కృష్ణమోహన్‌ను పెద్దమండ్యం తహసీల్దార్‌గా, తహసీల్దార్ సీకే.శ్రీనివాసులును కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం సూపరిండెంట్‌గా బదిలీ అయ్యారు.

విద్యుదుత్పత్తిలో ఆర్టీపీపీ రికార్డు



ఎర్రగుంట్ల: వేసవి కాలంలో విద్యుత్ ఉత్పత్తికి డిమాండ్ ఉంటుంది. అయితే డిమాండ్‌ను అధిగమిస్తూ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ) ఏపీజెన్‌కో యజమాన్యం ఆదేశాల మేరకు ఉత్పత్తి చేస్తూ వెలుగులు నింపుతోంది. ఆర్టీపీపీలో ఉన్న 1,2, 3,4,5,6 యూనిట్ల ద్వారా 1650 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతుంది. గురువారం 1650 మెగావాట్లకుగాను 1542 మెగావాట్ల ఉత్పత్తి జరిగింది. ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగులు కార్మికుల సమన్వయంతో పీక్ సమయంలో యూనిట్లు బాగా రన్ చేయడం సాధ్యపడిందని ఇన్‌చార్జి సీఈ దేవేంద్రనాయక్ తెలిపారు. గతంలో ఆర్టీపీపీకి చాలా బొగ్గు కొరత ఉన్న సమయంలో యూనిట్లను నిలుపుదల చేసిన పరిస్థితులు కూడా ఉన్నాయి.

దరఖాస్తుల అహ్వానం


రాయచోటి అర్బన్: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ఆర్థికసహాయం పొందేందుకు అర్హులైన విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ట్ కులాల సంక్షేమ సాధికారత అధికారి జాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండి డిగ్రీ, పీజీ, ఇంటర్మీడియట్ పరీక్షల్లో 60 శాతం మార్కులు, తత్సమాన గ్రేడ్‌లను కలిగి ఉన్నవారంతా అర్హులేనన్నారు. ఎంబీబీఎస్ కోర్సుకు నీట్‌లో అర్హత సాధించి ఉండాలన్నారు. ప్రపంచంలోని టాప్ 100 లోపు ర్యాంకు ఉన్న విశ్వవిద్యాలయాలు, విద్యాసంవత్సరాల్లో ప్రవేశం పొందితే ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వమే 100 శాతం ఫీజు (రూ.125లక్షలు) చెల్లిస్తుందన్నారు. ఇతర వర్గాలకు 100 లక్షల వరకు,100నుంచి 200లోపు ర్యాంకు కలిగిన యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొందితే ఎస్సీ,ఎస్సీ,బీసీ,మైనార్టీలకు 100 శాతం ఫీజు కింద రూ.75లక్షలు, ఇతర వర్గాలకు రూ. 50శాత ఫీజు కింద రూ.50లక్షలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అర్హత కలిగిన వారు జూన్ 10వ తేదీలోగా జన్మభూమి.ఎపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చెత్తే బంగారమాయెనె

రాజంపేట రూరల్: కూచివారిపల్లెలో పచ్చని చెట్ల మధ్య చెత్తసంపద తయారీ కేంద్రం



- తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీ కంపోస్టు తయారీ
- జిల్లాలో 439 చెత్త సంపద కేంద్రాలు
- పంచాయతీలకు సమకూరుతున్న ఆదాయం





అన్నమయ్య జిల్లా కూచివారిపల్లి పంచాయతీ పరిధిలో వర్మీకంపోస్టు ఎరువుతో ఏపుగా పెరుగుతున్న టెంకాయ చెట్లు, ఆకు కూరల తోటలు (ఇన్‌సెట్) చెత్త సంపద కేంద్రంలో తడి, పొడి వస్తువులను వేరు చేస్తున్న సిబ్బంది

రాయచోటి: చెత్తేకదా అని తేలిగ్గా తీసి పడేయకండి. ఎందుకంటే ఇప్పుడది సంపదను సృష్టించే వనరుగా మారింది. దాని నుంచి వర్మీ కంపోస్టును తయారు చేస్తూ ఆయా గ్రామ పంచాయతీలు ఆదాయార్జనకు బాటలు వేసుకుంటున్నాయి. చెత్తతో సంపదను సృష్టించుకుంటూ కాదేదీ వృథా అన్న రీతిలో పల్లెలు ముందుకు సాగుతున్నాయి. ప్రజా ఆరోగ్యాన్ని సంరక్షించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పంలో ఇదంతా సాధ్యమవుతోంది. ఇప్పటికే ప్రతి పంచాయతీలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) ఏర్పాటయ్యాయి. ఆయా గ్రామాల్లో క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. దీనిద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయిస్తున్నారు. తద్వారా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరుతోంది.

తడి,పొడి చెత్త సేకరణ

అన్నమయ్య జిల్లాలో 30 మండలాల పరిధిలో 501 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 439 ఎస్‌డబ్ల్యూపీసీలను ఏర్పాటు చేశారు. ఇంకా 62 ఎస్‌డబ్ల్యూపీసీల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఒక నెలలోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేంద్రాల్లో 1275 మంది క్లాప్ మిత్రలు, 432 మంది షెడ్ మిత్రలు పనిచేస్తున్నారు. వీరంతా గ్రామాల్లో వారికి కేటాయించిన కాలనీల్లో చెత్త తరలించే రిక్షాలలో ఉదయం 6 గంటల నుంచి తడిచెత్త, పొడిచెత్త సేకరించి ఆయా కేంద్రాలకు తరలిస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా నిర్వహణ....

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా గ్రామ పంచాయతీలకు ఆదాయం చేకూరుతోంది. క్లాప్ మిత్రలు గ్రామాల్లోని ఇళ్లనుంచి సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీల్లో తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, గాజు సీసాలు, పనికిరాని గుడ్డముక్కలు, చెప్పులు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, సబ్బు, బిస్కెట్, పాలకవర్లు, పాడైన బ్యాటరీలు, ఎలక్ట్రికల్ వస్తువులు, నోటుపుస్తకాలు, అట్టపెట్టెలు, బట్టలు, అనుప, స్టీల్ తదితర ఘన పదార్థాలను 13 రకాల తొట్లలో నింపి నెలకోసారి విక్రయిస్తున్నారు. పశువుల పేడ, మిగిలిపోయిన ఆహారపదార్థాలు, కొబ్బరి పీచు, కూరగాయల తొక్కలు, పచ్చగడ్డి, ఎండుగడ్డి, వంటగదుల్లో ఉత్పత్తయ్యే వ్యర్థపదార్థాలను ప్రత్యేక తొట్లలో లేయర్లుగా విభజిస్తారు. 45 రోజులపాటు వానపాములు వదిలి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి కిలో రూ. 6 చొప్పున విక్రయిస్తున్నారు. ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఏడాదికి మేజర్ పంచాయతీకి రూ. 80 వేలు నుంచి రూ.లక్ష ఆదాయం చేకూరుతోంది. మైనర్ పంచాయతీకైతే సుమారు రూ. 40 వేలు నుంచి రూ. 60 వేలు వరకు ఆదాయం వస్తోంది. జిల్లాలో మొత్తం 439 చెత్త సంపద కేంద్రాల నుంచి వర్మీ కంపోస్టు ఏడాదికి సుమారు రూ. 80 లక్షల నుంచి రూ. 90 లక్షల వరకు జిల్లా ఆదాయం చేకూరుతోంది. 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్, ప్రభుత్వ నిధులతో పాటు ఈ మొత్తాన్ని పంచాయతీల అభివృదికి వినియోగిస్తున్నారు.

క్లాప్, షెడ్ మిత్రలకు జీవనోపాధి......

జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమం ద్వారా క్లాప్, షెడ్ మిత్రలు జీవనోపాధి పొందుతున్నారు. ప్రతిరోజూ ఉదయం సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలిస్తుంటారు. వీరికి నెలకు రూ. 6 వేలు చొప్పున వేతనం ఇస్తున్నారు. స్వచ్ఛఆంధ్రకార్పొరేషన్ ద్వారా వేతనాలు వారి ఖాతాలలో జమ అవుతున్నాయి.

పరిశుభ్రత, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

రోడ్లు, పరిసరాలు, డ్రైనేజీలలో చెత్తపడేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుండేది. తద్వారా దోమలు, పందులు స్వైర విహారంతో ప్రజలు వివిధ రకాల రోగాల బారిన పడేవారు. జగనన్న స్వచ్ఛసంకల్పం పథకంతో గ్రామాలు అందంగా మారిపోయాయి. ప్రతి శుక్రవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డీఎల్‌పీఓలు, ఈఓఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో జరిగే పారిశుద్ధ్య కార్యక్రమాలను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో జగనన్న స్వచ్ఛసంకల్ప కార్యక్రమాల నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణకు మండల, జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేశారు.

మాపల్లె బాగుంది



నా పేరు రసూల్ సాహెబ్, అన్నమయ్య జిల్లా, రాజంపేట మండలం, మా పంచాయతీ పరిధిలో ఇళ్లవద్దకు ఉదయం 6 గంటలకు రిక్షాలో చెత్తను సేకరించి ఊరు శివారులోని చెత్త సంపద కేంద్రానికి చెత్తను తరలిస్తున్నారు. మా పల్లె ఇప్పుడు చాలా బాగుంది.

ప్రజలు సహకరించాలి



ఇళ్లలోని చెత్త, వ్యర్థాలను డస్ట్ బిన్‌లో వేయాలి. ఇళ్ల వద్దకు క్లాప్ మిత్రలు వచ్చినప్పుడు చెత్త రిక్షాలో వేసి సహకరించాలి. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు రిక్షా ద్వారా చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించి అక్కడ వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నాం.

-వెంకటేష్, క్లాప్ మిత్ర, కూచివారిపల్లె, రాజంపేట మండలం

గ్రామాలు పరిశుభ్రం



జగనన్న స్వచ్ఛసంకల్పం ద్వారా గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. ఇళ్లనుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి ఎరువు తయారు చేయిస్తున్నాం. చెత్తనుంచి తయారు చేసిన వర్మీని కిలో రూ. 6 నుంచి రూ. 10 చొప్పున అమ్మాలని గ్రామ పంచాయతీలకు సూచనలు ఇచ్చాం.జిల్లాలో అన్ని గ్రామాల్లో వర్మీ తయారీ ప్రక్రియ ఊపందుకుంది.

– ధనలక్ష్మీ డీపీఓ, అన్నమయ్య జిల్లా

చెత్త సంపద కేంద్రాలను వినియోగించాలి



చెత్తనుంచి తయారవుతున్న సంపద కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలి, తడి, పొడి చెత్త సేకరణకు సంబంధించి ప్రజలకు అధికారులు ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రణాళిక ప్రకారం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్తనుంచి వర్మీ తయారీ ప్రక్రియ మొదలైతే గ్రామ పంచాయతీల ఆదాయం భారీగా పెరుగుతుంది.

-గిరీషా పీఎస్, జిల్లా కలెక్టర్

వైవీయూ, ఏఎఫ్‌యూలో కోర్సులకు అనుమతులు



యోగివేమన విశ్వవిద్యాలయం ముఖద్వారం

వైవీయూ/ఏఎఫ్‌యూ : ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) జిల్లాలోని రెండు విశ్వవిద్యాలయాలకు 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. యోగివేమన విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సంబంధించి ఒక్కో కోర్సులో 60 సీట్లు చొప్పున అనుమతులకు ఓకే చెప్పింది. ఇటీవల వర్చువల్ విధానంలో ఏఐసీటీఈ అధికారులు విశ్వవిద్యాలయ అధికారులతో సమావేశం నిర్వహించడంతో పాటు డిటైల్డ్ రిపోర్ట్‌ను అధ్యయనం చేసి సిఫార్సు చేయడంతో ఏఐసీటీఈ అనుమతులు జారీచేసింది. ఏఐసీటీఈ అనుమతులు లభించడం పట్ల విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య సంతోషం వ్యక్తం చేశారు.

- నూతనంగా ఏర్పాటైన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని 12 కోర్సులకు సంబంధించి 6 కోర్సులకు 40 సీట్లు, మరో 6 కోర్సులకు 60 సీట్లకు అనుమతులు జారీచేస్తూ ఏఐసీటీఈ ఉత్తర్వులు జారీచేసింది. విశ్వవిద్యాలయానికి ఏఐసీటీఈ అనుమతులు మంజూరు చేయడం పట్ల విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

టెన్త్ టాపర్లను సన్మానించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ఎస్ఎస్‌సీ పరీక్షలలో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను, పాఠశాల యాజమాన్యం సన్మానం చేసే కార్యక్రమాలను ఎంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. గురువారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సంబంధిత కార్యదర్శులు, అధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ శాఖల అధికారులు ఆర్ఐఓలతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అ జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎస్ఎస్‌సీ పరీక్షలలో ప్రభుత్వ విద్యాలయాల్లో చదివి మెరుగైన ఫలితాలు సాధించిన టాపర్ విద్యార్థులను వారి తల్లిదండ్రులను, పాఠశాల యాజమాన్యంను సన్మానం చేయాలన్నారు. జిల్లా స్థాయిలో మొదటి, రెండో, మూడో స్థానంలో ఎస్ఎస్‌సీలో టాపర్లుగా నిలిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు.

అధిక ఉష్ణోగ్రతల వల్లే విద్యుత్ అంతరాయం

- ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ పర్యవేక్షక ఇంజినీరు రమణ



మాట్లాడుతున్న ఎస్. రమణ

కడప కార్పొరేషన్: జిల్లాలో ఇదివరకెన్నడూ లేనివిధంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం వల్లే విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం కలుగుతోందని ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ అన్నారు. గురువారం ఇక్కడ ఆయన మాట్లాడారు. అన్నమయ్య జిల్లా, సంబేపల్లి మండలంలోని మోటకట్ల ఆయన స్వగ్రామం. తిరుపతి కన్‌స్ట్రక్షన్ డివిజన్‌లో, పీలేరులో, చిత్తూరు రూరల్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేశారు. పదోన్నతిపై కడప ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈగా వచ్చారు. కడపలో పట్టణంలో ఏడీఈగా పనిచేసిన అనుభవం ఉంది. ఇంకా ఆయన ఏమన్నారంటే...

వైఎస్సార్ జిల్లాలో మొత్తం 1179 ఫీడర్లు ఉండగా, అందులో 793 అగ్రికల్చర్ ఫీడర్లు ఉన్నాయన్నారు. సాధారణంగా ప్రతిరోజూ జిల్లాలో 600 నుంచి 700 మెగావాట్ల మధ్యలో విద్యుత్ వినియోగం జరుగుతుందన్నారు. రెండు, మూడు రోజులుగా విద్యుత్ డిమాండ్ బాగా పెరిగిందన్నారు. 44 డిగ్రీలకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడమే ఇందుకు కారణమని తెలిపారు. మొన్న(మంగళవారం) ఉదయం 557 మెగావాట్లు, మధ్యాహ్నం 12 గంటలకు అత్యధికంగా 959 మెగావాట్లు, సాయంత్రం 439 మెగావాట్ల విద్యుత్ వాడకం జరిగిందన్నారు. ఇంత ఉష్ణోగ్రతల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్ అయి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. రాత్రిపూట కొద్దిసేపు వాటిని కూల్ చేసి నిర్వహణ చేసే క్రమంలోనే విద్యుత్ అంతరాయం కలుగుతోందన్నారు. అంతే తప్ప అవి విద్యుత్ కోతలు కావన్నారు. నాలుగైదు రోజుల్లో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంతో పోల్చితే డిమాండ్‌కు తగినట్లు విద్యుత్ ఉత్పత్తి ఉందని, ధర ఎంతైనా ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధగా ఉందన్నారు. బొగ్గు నిల్వలు కూడా నెల రోజులకు సరిపడా అందుబాటులో ఉన్నాయన్నారు. అగ్రికల్చర్ సర్వీసులకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న నెల లోపే కనెక్షన్లు ఇస్తున్నామని, ఇప్పటికి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 1000 కనెక్షన్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 500 సర్వీసులకు సంబంధించి పనులు జరుగుతున్నాయన్నారు. ఎక్కడా మెటీరియల్ కొరత లేదన్నారు. సబ్ ఇంజినీర్ నుంచి ఏఈకి పదోన్నతి కల్పించే అంశం కోర్టు పరిధిలో ఉన్నందున పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కొత్త రిక్రూట్‌మెంట్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. త్వరలోనే ఖాళీగా ఉన్న ఏఈ పోస్టులు, జేఎల్ఎం, ఇతర పోస్టులు భర్తీ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత వేసవిలో సమస్యలు ఉత్పన్నం కాకుండా రౌండ్ ద క్లాక్ పనిచేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించామని, ఏవైనా సమస్యలుంటే సంబంధిత సబ్‌స్టేషన్‌కు, ఏఈలకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

22న జెడ్పీ, డీఆర్సీ సమావేశాలు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం, జిల్లా సమీక్షా కమిటీ సమావేశం ఈ నెల 22వ తేదీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వెంకటరావ్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశం ఉదయం 9 గంటలకు జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమదనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి హాజరవుతారన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సురేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.

సేవకు సత్కారం

- జిల్లాలో 7975 మంది వలంటీర్లు
- ప్రజలకు విశేష సేవలు అందించిన వారికి ప్రత్యేకంగా ప్రత్యేక గుర్తింపు
- సేవా పతకాలతో సత్కరిస్తున్న ప్రభుత్వం
- సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రల కేటగిరీల కింద పురస్కారాలు



అన్నమయ్య జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయం

సాక్షి, రాయచోటి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందించడంలో విశేష సేవలందిస్తున్న వలంటీర్లను ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది. పేదలకు సంబంధించి ఎలాంటి తారతమ్యాలు చూపకుండా సకాలంలో సంక్షేమాన్ని అందిస్తున్న వలంటీర్లను సత్కారాలతో గౌరవించి ప్రోత్సహించాలని సంకల్పించింది. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అయితే వారికి నెలనెలా రూ.5వేల చొప్పున గౌరవ వేతనం కింద ఇస్తున్న ప్రభుత్వం.. విశేష సేవలందిస్తున్న వారికి ప్రభుత్వం తరపున ప్రోత్సహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా గత ఏడాది విశిష్ట సేవలందించిన వారికి వివిధ రకాల ప్రోత్సాహకాల కింద నగదుతోపాటు శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు.

పనిచేసిన ప్రతి ఒక్క వలంటీర్‌కు గుర్తింపు

అన్నమయ్య జిల్లాలో మున్సిపాలిటీలతోపాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 7975మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వారిని ప్రభుత్వం మూడు కేటగిరీల కింద ఎంపిక చేసి నగదు ప్రోత్సాహకంతోపాటు ఇతర సత్కారాలు చేయనుంది. సేవా మిత్ర కింద ఎంపిక చేసిన వలంటీర్లకు రూ.10వేల చొప్పున, సేవా రత్న కింద ఎంపిక చేసిన వారికి రూ.20వేలు, సేవా వజ్ర కేటగిరి కింద ఎంపిక చేసిన వారికి ఒక్కొక్కరికి రూ.30వేల చొప్పున అందించనున్నారు. జిల్లాలో సేవా వజ్ర కింద 26 మంది ఎంపిక కాగా, సేవా రత్న కింద 171మంది, అలాగే సేవా మిత్ర కేటగిరీ కింద 7778మంది ఎంపికయ్యారు. వలంటీర్లకు సంబంధించి ప్రతినెలా 1వ తేదీ తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ, ఇతర ప్రాంతాలలో లబ్ధిదారులు ఉన్నప్పటికి అక్కడికే వెళ్లి సంక్షేమం అందించడం, సకాలంలో సేవలు అందించే విధానంలో సర్వేలు సత్వరమే పూర్తి చేయడం, ఆన్‌లైన్ లిస్టుల వెరిఫికేషన్, లబ్ధిదారుల జాబితా, ఇతర సేవలు, సంక్షేమ ఫలాల జాబితా తయారీలో వేగంగా స్పందించడం, ఇతర అన్ని వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరించేవారిని ప్రభుత్వం ఈ అవార్డులకు అర్హతలను బట్టి ఎంపిక చేసింది.

నేటి నుంచి సత్కారాలు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సత్కారాలు ప్రారంభించగానే.. జిల్లాలో చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండవ ఏడాది వలంటీర్లను సత్కరించేందుకు సిద్ధమైంది. ఈనెల 19వ తేదీనుంచి ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో వలంటీర్ల సేవల ఆధారంగా మూడు కేటగిరీల వారీగా పేర్లను సిద్ధం చేశారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

అన్నమయ్య జిల్లాలోని వలంటీర్లకు సంబంధించి మూడు విభాగాల్లో విశేష సేవలు అందించిన వారిని గుర్తించాం. ప్రతిఫలం ఆశించకుండా ప్రజలకు సేవలు అందించడం ప్రశంసనీయం. దేశంలో ఎక్కడా లేనివిధంగా మనకు మాత్రమే వలంటీర్ల వ్యవస్థ ఉంది. అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు కష్టపడుతున్న వలంటీర్లను ప్రతి ఏడాది సత్కరిస్తున్నాం. ఈ ఏడాది కూడా ఎంపికైన వలంటీర్లకు నేటి నుంచి సన్మానంతోపాటు పారితోషికం, సర్టిఫికెట్లను అందించనున్నాం.

– గిరీషా పీఎస్, జిల్లా కలెక్టర్, అన్నమయ్య జిల్లా

నేడు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సమావేశం



మాట్లాడుతున్న జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు

వైవీయూ: కడపలోని హరిత టూరిజం హోటల్‌లో ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు గ్రేటర్ రాయలసీమ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ఆత్మీయ సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని కడప జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. మదన్‌మోహన్‌రెడ్డి, జి. వెంకటశ్రీను తెలిపారు. గురువారం కడపలో వారు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారం గురించి చర్చించనున్నట్లు తెలిపారు. కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పాల్గొని ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల కరస్పాండెంట్‌లు సంజీవ్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేట్‌మ్యాన్‌పై దాడి

వాల్మీకిపురం : పట్టణ పరిధి నిమ్మనపల్లి రోడ్డులోని రైల్వేగేట్ వద్ద గేట్‌మ్యాన్‌పై ముగ్గురు యువకులు దాడికి పాల్పడిన సంఘటన చోటు చేసుకొంది. వివరాలు.. రైల్వే స్టేషన్‌లో గేట్‌మ్యాన్‌గా పని చేస్తున్న వాసుదేవరెడ్డి గురువారం నిమ్మనపల్లి రోడ్డులో రైల్వే గేట్‌మ్యాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో రైలు వస్తుండడంతో సిగ్నల్ రావడంతో గేట్ మూసివేశారు. గేట్ తెరవాలని ముగ్గురు యువకులు గేట్‌మ్యాన్‌పై గొడవకు దిగారు. ఇది కాస్తా పెరిగి గేట్‌మ్యాన్‌పై దాడి చేశారు. బాధితుడు వాసుదేవరెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై లీలావతికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అక్కాచెల్లెళ్ల అదృశ్యం

వాల్మీకిపురం : ఇద్దరు అక్కాచెల్లెళ్ల అదృశ్యమైన సంఘటన మండలంలోని ఓబులంపల్లిలో గురువారం చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఓబులంపల్లికి చెందిన నీరజ (19) వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె చెల్లులు సంగీత (17) మదనపల్లి బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వీరికి తల్లిదండ్రులు లేకపోవడంతో నానమ్మ లక్ష్మీదేవమ్మ వద్ద ఉంటున్నారు. ఇద్దరికీ వేసవి సెలవులు కావడంతో నానమ్మ ఇంటి దగ్గరే ఉంటున్నారు. గురువారం ఉదయం నుంచి ఇద్దరూ అదృశ్యం అయ్యారని ఏఎస్సై లీలావతికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత

మదనపల్లె : మండలంలోని కోటవారిపల్లె పంచాయతీ అడవిలోపల్లె వద్ద ఉన్న నడించెరువులో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన కర్ణాటక వాసి శంకర (50) మృతదేహాన్ని గురువారం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెలికి తీశారు. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన శంకర జ్యోతిశ్యం చెబుతూ జీవించేవాడు. ఇతను పట్టణంలోని రామారావుకాలనీలో నివాసమున్న శ్రీనివాసులు హిందూపురం, బోయపేటకు చెందిన నంజుండప్పతో కలిసి అడవిలోపల్లె వద్ద ఉన్న నడించెరువులో మంగళవారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. వల వేశారు. తర్వాత ముగ్గురూ కలిసి మద్యం తాగారు. చేపలు పడేంత వరకు ఈత కొట్టాలని చెరువులోకి దిగారు. అయితే చెరువులో ఉపాధి హామీ గుంతలు లోతుగా ఉండటంతో అంచనా వేయలేక శంకర ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. మిగిలిన ఇద్దరు విషయాన్ని స్థానికులకు తెలిపారు. వారు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. రెండు రోజుల పాటూ కష్టపడి మూడో రోజున మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

బావపై హత్యాయత్నం కేసులో బామ్మర్ది అరెస్ట్

- పథకం ప్రకారమే చెల్లెలిని, బావను చంపేందుకు నిర్ణయం
- అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి బయటపడ్డ వైనం




నిందితుడి అరెస్ట్ చూపుతున్న టూటౌన్ సీఐ మురళీకృష్ణ, (ఇన్‌సెట్) హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తి

మదనపల్లె : తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఆస్తిపంపకాల్లో చెల్లెలి కుటుంబానికి, తనకు ఉన్న వివాదంలో భాగంగా పథకం ప్రకారం బావను, చెల్లెలును హత్య చేసేందుకు ప్రయత్నించి విఫలమైన బావమరిదిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మురళీకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెలో నివాసం ఉంటున్న జంగాల రామకృష్ణ(55) భార్య శివకుమారికి, పుంగనూరు పట్టణం తాటిమాకులపాళ్యంకు చెందిన అన్న బండారుశంకరప్పతో ఆస్తి వివాదం ఉంది. శివకుమారికి తల్లిదండ్రుల నుంచి ఆస్తి పంపకాల్లో భాగంగా విలువైన 15 సెంట్ల స్థలం వాటాగా దక్కింది. ఈ స్థలంలో కొంత విక్రయించగా, మిగిలిన స్థలానికి సంబంధించి అన్నాచెల్లెళ్ల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆస్తికి సంబంధించి సరిహద్దుల విషయంలో అన్న శంకరప్పపై చెల్లెలు శివకుమారి.. ఫోర్జరీ సంతకాలతో తన ఆస్తిని ఇతరులకు విక్రయించినట్లుగా పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. కేసులో భాగంగా బండారు శంకరప్ప అరెస్ట్ అయ్యాడు. తర్వాత విడుదలయ్యాడు.

నమ్మించి..

కొంత కాలం తర్వాత ఎలాగైనా బావ రామకృష్ణ, చెల్లెలు శివకుమారిని అంతం చేసి ఆస్తిని దక్కించుకోవాలని శంకరప్ప పథకం వేశాడు. అందులో భాగంగా చెల్లెలు కుటుంబంతో మంచి మాటలు కలిపి రాకపోకలు సాగించాడు. బుధవారం పథకం ప్రకారం కత్తిని వెంటతీసుకెళ్లి ఇంట్లోనే ఇద్దరినీ హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగా పుంగనూరు నుంచి చెల్లెలి ఇంటికి వచ్చాడు. అక్కడ మరికొందరు ఇంట్లో ఉండటంతో పథకం అమలు చేయడం అసాధ్యమని భావించాడు. బావ రామకృష్ణను పుంగనూరుకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండులో వదలాల్సిందిగా కోరాడు. దీంతో రామకృష్ణ తన స్కూటీపై శంకరప్పను వెనుక కూర్చోబెట్టుకుని ఆర్టీసీ బస్టాండు వద్దకు వచ్చాడు. ఇన్‌గేట్ సమీపంలోకి రాగానే కరెంటు పోవడంతో వెంటనే శంకరప్ప తన వెంట తెచ్చుకున్న కత్తితో రామకృష్ణ గొంతుకోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు వెంటనే అప్రమత్తం కావడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. టూటౌన్ పోలీసులకు సమాచారం అందడంతో బాధితుడ్ని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. కేసులో నిందితుడైన శంకరప్ప గురువారం మదనపల్లె పట్టణంలోని ఎస్టేట్ బస్టాప్ వద్ద ఉండగా, టూటౌన్ ఎస్ఐ లోకేష్‌రెడ్డి సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశాడు. నిందితుని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపుమరకల షర్టు, రూ.150 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కోసం కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఆస్తులకు సంబంధించిన విషయాల్లో గొడవలు, హత్యలకు, హత్యాయత్నాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. బండారు శంకరప్పపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు చెప్పారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాలో అక్రమాలపై సీబీఐ విచారణ



కలికిరి బ్యాంక్ ఆఫ్ బరోడా కార్యాలయం

కలికిరి : బ్యాంక్ ఆఫ్ బరోడా కలికిరి బ్రాంచ్‌లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టింది. ఈ బ్రాంచ్‌లో పలు రకాల అక్రమాలు చోటు చేసుకున్నట్లు 2021 ఆగస్టు నెలలో వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లో వెలుగులో విధులు నిర్వహించే సంఘమిత్రలు, నష్టపోయిన ఖాతాదారులు ఇచ్చిన వరుస ఫిర్యాదుల మేరకు మదనపల్లి డీఎస్పీ రంగంలోకి దిగి కేసు నమోదు చేశారు. సుమారు నెల రోజులకు పైగా విచారణ అనంతరం 2021 సెప్టెంబరు నెల 16వ తేదీన 11 మంది బ్యాంక్ సిబ్బందిని, మెసెంజర్ సయ్యద్ అలీఖాన్, మరో నలుగురు అతని కుటుంబ సభ్యులు మొత్తం 16 మందిని కలికిరి పోలీసులు అరెస్టు చేయడం అప్పట్లో పెను సంచలనంగా మారింది. బ్యాంక్‌లో మొత్తం రూ.2 కోట్ల వరకు నిధులు గోల్‌మాల్ జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రధానంగా బ్యాంక్ తాత్కాలికంగా విధులు నిర్వహించే మెసెంజర్ సయ్యద్ అలీఖాన్ పాత్ర కీలకంగా ఉన్నట్లు గుర్తించారు. అతని అక్రమాలకు పలువురు బ్యాంక్ ఉద్యోగులు సహాయ సహకారాలు అందించినట్లు కూడా నిర్ధారించారు. 11 మంది బ్యాంక్ సిబ్బందిని బ్యాంక్ ఉన్నతాధికారులు విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. కొంతకాలం పోలీసు విచారణ సాగినా బ్యాంక్‌లో రికార్డులు పరిశీలించే కొద్దీ అక్రమాలు రకరకాలుగా వెలుగు చూడటంతో.. కేసును సీబీఐకి అప్పగించారు. దీంతో నాలుగు రోజులుగా సీబీఐ అధికారులు బ్యాంక్‌లో తిష్టవేసి గుట్టుగా విచారణ చేస్తున్నారు. బ్యాంక్‌లో తాత్కాలికంగా విధులు నిర్వహించే మెస్సెంజర్ అలీఖాన్ ఖాతాకు నిధులు మళ్లించిన ఖాతాల వివరాలతో.. ఖాతాదారులను విడతలవారీగా సీబీఐ అధికారి విచారణ చేస్తుండటంతో విషయం వెలుగులోకి వచ్చింది. విచారణ మరిన్ని రోజులు కొనసాగవచ్చని తెలుస్తోంది. ఏది ఏమైనా తమకు తెలియకుండా ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి నగదు మాయమైన ఖాతాదారులు, మోసాలకు గురైన ఖాతాదారులు తమకు ఎప్పుడు న్యాయం జరుగుతుంది, తమ నగదు ఎప్పుడు ఖాతాల్లో జమ అవుతుందో తెలియక సందిగ్ధంలో ఉన్నారు. తాము ఫిర్యాదు చేసినా తమను విచారణ చేయలేదని మరికొందరు ఖాతాదారులు బ్యాంక్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ..




సోమశిల బ్యాక్‌వాటర్ వద్ద బోల్తా పడిన ట్రాక్టర్, మృతి చెందిన బలరామయ్య

రాజంపేట : సోమశిల రిజర్వాయర్ ముంపు గ్రామాలైన తిమ్మరాచపల్లె-యల్లంపేట(నందలూరు మండలం) మధ్య వెలసి వున్న ముసలిపేటమ్మకు గురువారం మొక్కులు తీర్చుకునేందుకు వెళ్తున్న భక్తుల బృందం ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందగా, 11 మంది గాయాల పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండలం పల్లంపాడు అరుంధతీవాడకు చెందిన వారు ట్రాక్టర్‌లో ముసలిపేటమ్మ గుడికి బయలుదేరారు. ఈ ట్రాక్టర్‌లో 12 మంది ప్రయాణిస్తున్నారు. సోమశిల బ్యాక్‌వాటర్ గట్టుపై వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో బలరామయ్య (65) అనే వృద్ధుడు దుర్మరణం చెందాడు. మరో 11 మంది గాయాల పాలయ్యారు. గాయపడిన వారిలో రామక్క, లక్షుమయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. నలుగురు రాజంపేట ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. స్వల్ప గాయాలతో ఉన్న వారు ఇంటికి వెళ్లిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. కాగా ట్రాక్టర్ బ్యాక్‌వాటర్‌లో పడకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నందలూరు ఎస్ఐ చెన్నకేశవులు తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ కింద పడి వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన మక్బుల్

సంబేపల్లె : ట్రాక్టర్ ట్రాలీ కింద పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని రౌతుకుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రౌతుకుంట పంచాయతీ దిన్నెమీదపల్లెకు చెందిన పాలగిరి మక్బుల్ బాషా(34) వ్యవసాయం, రాళ్ల వ్యాపారం చేసుకొంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలోనే గురువారం గ్రామ సమీపంలో ట్రాక్టర్ ట్రాలీకి మరమ్మతులు చేస్తున్న సమయంలో ఉన్నఫళంగా ట్రాలీ తలపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించింది.

మనోవర్తి కేసులో భర్తకు జైలు

బద్వేలు అర్బన్ : భర్త నుంచి వేరుపడి విడిగా ఉంటున్న భార్యకు మనోవర్తి చెల్లింపులో జాప్యం చేసినందుకు బద్వేలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 15 రోజులు శిక్ష విధించింది. బి.కోడూరు మండలం అక్కుపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి పీరాంబి తన భర్త అయిన చెరుకూరి చిన్నపీరయ్య మీద 2017లో భరణం కేసు దాఖలు చేసింది. ఇరువురిని విచారణ చేసిన న్యాయస్థానం ప్రతి నెల రూ.3 వేలు చొప్పున భరణం చెల్లించాలని 2020 మే 29వ తేదీన ఆదేశాలు ఇచ్చింది. అయితే అప్పటి నుంచి కూడా చిన్నపీరయ్య భరణం చెల్లించకపోవడంతో తిరిగి పీరాంబి కోర్టుకు విన్నవించింది. దీనిపై విచారణ చేపట్టిన బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథ ఆచారి బుధవారం చెరుకూరి చిన్నపీరయ్యకు 15 రోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

వడదెబ్బకు వృద్ధురాలి మృతి



మృతి చెందిన లక్షుమ్మ

సిద్దవటం : మండల పరిధి పెద్దపల్లె గ్రామ పంచాయతీలోని శివునిపల్లె గ్రామానికి చెందిన సోమల లక్షుమ్మ(72) అనే వృద్ధురాలు గురువారం వడదెబ్బకు గురై మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజులుగా ఎండ వేడిమితో ఆమె బాధపడుతుండేది. గురువారం ఉదయం ఉన్నట్లుండి కింద పడిపోవడంతో కుటుంబ సభ్యులు 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు వారు తెలిపారు. సమాచారం తెలుసుకున్న మాధవరం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శివకుమార్ వచ్చి పరిశీలించారు. పెద్దపల్లె సర్పంచ్ కుమారుడు తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు.

పిడుగుపాటుకు గేదె..

ఓబులవారిపల్లె : మండలంలోని మంగంపేట కాపుపల్లి గ్రామంలో గురువారం పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. గ్రామంలోని చిన్నవెంకట సుబ్బారెడ్డికి చెందిన గేదె గ్రామ సమీపంలో మేత మేయడానికి వెళ్లింది. మబ్బులతో ఉరుములు మెరుపులు మెరిసి ఒక్కసారిగా పిడుగుపడటంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. పాలిచ్చే గేదె మృతి చెందిందని పాడి రైతు వాపోయాడు.

పై నుంచి కింద పడి ఐసీఎల్ ఉద్యోగి..



మృతి చెందిన వెంకటరమణ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఐసీఎల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న మెకానికల్ అధికారి నీలం వెంకటరమణ (56) డ్యూటీలో ఉండగా ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడి మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలంకూరు గ్రామానికి చెందిన నీలం వెంకటరమణ కొన్నేళ్ల నుంచి ఐసీఎల్‌లో పని చేస్తున్నాడు. మెకానికల్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుననట్లు ఎస్ఐ ఎతలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అతిగా మద్యం తాగి గుర్తు తెలియని వ్యక్తి..



కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంబాభవానీనగర్‌కు వెళ్లే దారిలో వున్న మంగళి వీధిలో గుర్తు తెలియని వ్యక్తి అతిగా మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. ఉదయం 11 గంటల సమయంలో సదరు గుర్తు తెలియని వ్యక్తి మద్యం మత్తులో ఆ ప్రాంతంలో పడిపోయాడు. సాయంత్రం సమయానికి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో కడప వన్‌టౌన్ ఎస్ఐ సిద్దయ్య తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తమను సంప్రదించాలని కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు సెల్ నంబర్ 91211 00510, ఎస్ఐ సిద్దయ్యకు సమాచారం అందించాలని, లేక నేరుగా సంప్రదించాలి.

సీపీఐ కార్యాలయంలో ప్రేమ జంటకు వివాహం

ప్రొద్దుటూరు : మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో గురువారం కడప నగరానికి చెందిన ప్రేమ జంట చందు శ్రీహరి, మెహనూర్‌లకు సీపీఐ నాయకులు వివాహం జరిపించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ కడప నగరానికి చెందిన చందు శ్రీహరి, మెహనూర్ గత ఏడాదిన్నరగా ఒకరినొకరు ఇష్టపడుతున్నారన్నారు. వీరు ఇరువురూ సీపీఐ పార్టీని ఆశ్రయించారన్నారు. వీరు మేజర్లు కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. వివాహం అనంతరం వచ్చే ఒడిదుడుకులను తట్టుకుని నిలబడాలని తెలిపామన్నారు. వారు అందుకు సమ్మతించడంతో మీడియా ఎదుట వివాహం జరిపించామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, సభ్యులు హరి, ప్రమీల, ప్రతాప్, సుధాకర్, ఏఐవైఎఫ్ నాయకులు సురేష్, యునస్ తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో నిధుల స్వాహా



బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయం

బి.కొత్తకోట : బి.కొత్తకోట నగర పంచాయతీలో ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు ప్రభుత్వ ఖాతాలకు జమ చేయకుండా భారీ స్థాయి నిధుల స్వాహా జరిగిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేసి అక్రమార్కుల లెక్క తేల్చాలంటూ కమిషనర్ పి.నరసింహప్రసాద్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గత కమిషనర్ హయాంలో జరిగిన ఈ వ్యవహారంపై ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగర పంచాయతీ ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులకు సంబంధించిన పుస్తకాల పరిశీలన తర్వాత బిల్ కలెక్టర్ పి.డేనియల్ రూ.5,89,796, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి టి.రామాంజనేయులు రూ.2,17,359 స్వాహా చేశారని కమిషనర్ నరసింహప్రసాద్ ఫిర్యాదు చేశారు. వసూలు చేసిన పన్నులను ప్రభుత్వ ఖాతాలకు జమ చేయకుండా కుట్రపూరితంగా వ్యవహరించారని, ప్రజల నమ్మకానికి భంగం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రజలకు జారీ చేసిన పన్నుల నోటీసుల్లో గత కమిషనర్ బి.వెంకట్రామయ్య (ప్రస్తుతం తిరుపతి జిల్లా వెంకటగిరి కమిషనర్) సంతకాలు గుర్తించామన్నారు. ఈ పన్నుల స్వాహా వ్యవహారంలో కుట్ర పూరితంగా భాగస్వామ్యం కలిగిన ఇతర అధికారులపైనా చర్యలు తీసుకుని నిధులను రాబట్టాలని పేర్కొన్నారు. దీన్నిబట్టి చూస్తే నిధుల స్వాహా ప్రస్తుతం వెలుగు చూసిన దానికంటే ఎక్కువ మొత్తంలో ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బిల్ కలెక్టర్ డేనియల్ ఇప్పటికే సస్పెండ్ అవ్వగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి టి.రామాంజనేయులను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించారు. కాగా వసూలైన నగదు ఖాతాలకు జమ చేయకుండా స్వాహా చేసిన నగదు వ్యవహారంలో ఎవరెవరి ప్రమేయం ఉందో పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మాయమైన డ్రోన్ ముక్కలై లభ్యం



నాలుగు ముక్కలుగా లభించిన డ్రోన్ యంత్రం

గుర్రంకొండ : నాలుగు రోజుల క్రితం మాయమైన డ్రోన్ యంత్రం.. నాలుగు ముక్కలై లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీలో డ్రోన్ సర్వే చేయాడానికి గానూ అధికారులు ఈ నెల 15న అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పంచాయతీ పరిధిలోని కామన్నగారిపల్లెలో అదే రోజు ఉదయం 11 గంటలకు లాంఛనంగా డ్రోన్ సర్వేను ప్రారంభించారు. 12 గంటల వరకు డ్రోన్ యంత్రం పని చేసింది. అయితే గంట సమయం తరువాత ఉన్నట్టుండి డ్రోన్ యంత్రం గ్రామాలకు దక్షిణం వైపు ఉన్న సిగలబోటు కొండ వైపు దూసుకెళ్లింది. ఏం చేయాలో తెలియక అధికారులు, సిబ్బంది దాని ఆచూకీ కోసం విశ్వప్రయత్నం చేశారు. గత నాలుగు రోజులుగా కొండల్లో తిరుగుతూ డ్రోన్ యంత్రాన్ని కనిపెట్టే పనిలో పడ్డారు. ఎట్టకేలకు సిగలబోటు కొండలో నాలుగు ముక్కలై కనిపించింది. దట్టమైన కంప పొదల్లో రెండు ముక్కలు, బండల మాటున రెండు ముక్కలు లభించాయి. డ్రోన్ విలువ సుమారు రూ. 30 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఈ విషయమై మండల సర్వేయర్ రెడ్డిశేఖర్‌ను వివరణ కోరగా గురువారం మధ్యాహ్నం 12 గంటలకు డ్రోన్ యంత్రాన్ని కొండల్లో గుర్తించామన్నారు.

ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు



దేవేంద్ర మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : కన్నీటి పర్యంతం నడుమ ఆర్మీ జవాన్ దేవేంద్ర (25) అంత్యక్రియలు గురువారం స్వగ్రామమైన సోమలవాండ్లపల్లిలో జరిగాయి. మండలంలోని మద్దిరేవుల గ్రామం సోమలవాండ్లపల్లెకు చెందిన ఆర్మీ జవాన్ సోమల దేవేంద్ర మృతదేహానికి అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, రామాపురం ఎంపీఓ మద్దిరేవుల సురేంద్రనాథ్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పీలేరు వంటిల్లు వద్ద మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న ఆర్మీ జవాన్ దేవేంద్ర మృతదేహాన్ని బుధవారం స్వగ్రామమైన సోమలవాండ్లపల్లెకు తీసుకురావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దేవేంద్ర మృతదేహం వద్ద తల్లిదండ్రులు, సోదరులు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. దేవేంద్ర భార్య ఎనిమిది నెలలు గర్భిణి. ఆమె గుండెలవిసేలా రోదించడం పలువురిని కలిచివేసింది. మద్దిరేవుల గ్రామ ఉపసర్పంచ్ సంజీవరెడ్డి, వెంకటరామిరెడ్డి, చిన్న వెంకటరమణ, రమణయ్యలు దేవేంద్ర మృతదేహానికి నివాళులర్పించారు.